

సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం | 30 | ఆగస్టు | 2025



60.050 టీఎంసీలకు సోమశిల

జలాశయానికి శుక్రవారం 19,496 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 1850, ఉత్తరకాలువకు 400, కండలేరుకు 10,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 60.050 టీఎంసీలు ఉన్నాయి.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.1,05,640
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,526
3 శాతం జీఎస్టీతో	రూ.9,812
నవర (8 గ్రా)	రూ.78,496

గరిష్టం/కనిష్టం
35.2 /26.6

వాతావరణం


జిల్లాలో శనివారం వాతావరణం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. శుక్రవారం గాలిలో తేమ 67 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

శిక్షణ, ఉద్యోగావకాశాలు

నెల్లూరు (పొగతోట): డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోగోలు, కోవూరులో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఎలక్ట్రానిక్స్, ఫీల్డ్ టెక్నీషియన్, సర్వీస్ ఇంజినీర్, ఐటీ హార్డ్‌వేర్ తదితర వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఇంటర్ పాస్, డిగ్రీ చదివిన నిరుద్యోగులైన యువతి, యువకులు డీఆర్‌డీఏ కార్యాలయంలోని జాబ్స్ విభాగంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9493513896, 9553491047, 9032693233 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎన్‌ఎల్‌ఆర్ 3648 నూతన వరి రకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లూరు (పొగతోట): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (వ్యవసాయ పరిశోధన క్షేత్రం)లో ఎన్‌ఎల్‌ఆర్ 3648 నూతన వరి రకం విత్తనాలను అధికారులు సిద్ధం చేశారు. పరిశోధన క్షేత్రంలో వరి పంటను రైతులకు శుక్రవారం పరిచయం చేశారు. పరిశోధన క్షేత్రం అధికారులు శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈ రకం వరి వంగడం అన్ని రకాల వాతావరణాలను తట్టుకుని అధిక దిగుబడులను ఇస్తుందని తెలిపారు. ఈ వరి దిగుబడులపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. జిల్లాలోని రైతులందరికీ ఎన్‌ఎల్‌ఆర్ 3648 రకం విత్తనాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధన క్షేత్రం అధికారి వినిత, రైతులు పాల్గొన్నారు.

18 బార్లకు దరఖాస్తుల దాఖలు

నెల్లూరు (క్రైమ్): బార్లకు దరఖాస్తులు దాఖలు చేసేందుకు ప్రభుత్వం గడువు పెంచినప్పటికీ వ్యాపారుల స్పందన నామ మాత్రంగానే ఉంది. జిల్లాలోని ఓపెన్ కేటగిరీలో 50, గౌడ కులాలకు 5 బార్లకు సంబంధించి శుక్రవారంతో గడువు ముగిసింది. 55 బార్లకు 18 బార్లకు మాత్రమే దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే గడువు ముగిసే సమయానికి కొందరు ఆఫ్ లైన్‌లో దరఖాస్తులు వేసేందుకు క్యూలైన్లలో ఉండడంతో వారి నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకోనున్నారు. నెల్లూరు నగరంలో 38 బార్లకు 10, కావలిలో రెండు బార్లకు, కందుకూరులో మూడు బార్లకు దరఖాస్తులు అందాయి. గీత కులాలకు సంబంధించి నెల్లూరు నగరంలోని రెండు బార్లకు, కావలిలో ఒక బారుకు దరఖాస్తులు అందాయి. కందుకూరులోని ఒక బారుకు మూడు దరఖాస్తులు, అల్లూరులోని ఒక బారుకు ఒక దరఖాస్తు మాత్రమే అందాయి. అయితే ఒక్కో బారుకు నాలుగు దరఖాస్తులు అందాలనీ, ఒక్కరే నాలుగు దరఖాస్తులు వేయకూడదనే నిబంధన ఉండడంతో 18 బార్లకు వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. శనివారం నగరంలోని న్యూ జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో డ్రా నిర్వహించనున్నారు.

పింఛన్ బాధితులు దరఖాస్తులు చేసుకోండి

నెల్లూరు(పొగతోట): పింఛన్లు తొలగించిన దివ్యాంగులు ఎంపీడీఓ, మునిసిపల్ కమిషనర్లకు దరఖాస్తులు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వైద్యాధికారులు అంగవైకల్యాన్ని పరిశీలించి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. వాటి ఆధారంగా దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడం, మార్పులు చేయడం జరిగిందన్నారు. రద్దు చేసిన, మార్పులు చేసిన పింఛన్ల లబ్ధిదారులు అర్హులని భావిస్తే ఎంపీడీఓ, మునిసిపల్ కమిషనర్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పాత పింఛన్ కార్డు, సర్టిఫికెట్లు, బయోమెట్రిక్ ద్వారా అందుకున్న నోటీసు, ఆధార్ కార్డుతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పునః పరిశీలించి చర్యలు చేపడుతామన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు?

నెల్లూరు (క్రైమ్): నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని చంపేస్తే డబ్బేడబ్బుని కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వీడియో సోషల్ మీడియాల్లో వైరల్ అయింది. దీన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకుని అన్నీ కోణాల్లో విచారిస్తున్నారు. వీడియో తీసిన సమయంలో అక్కడ ఎనిమిది మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వారిలో రౌడీషీటర్ జగదీష్ ఇప్పటికే జైల్లో ఉండగా మిగిలిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీడియో తీసిన సమయంలో వారు అక్కడ ఎందుకు ఉన్నారు? ఏం మాట్లాడుకున్నారు? ఇలా అన్నీ కోణాల్లో లోతుగా విచారిస్తున్నట్లు తెలిసింది.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద పోలీసుల మోహరింపు



ఎమ్మెల్సీ నివాసం వద్ద భారీగా చేరుకున్న పోలీసులు

ఖాకీ.. అడ్డదారి

- కావలికి వస్తే ఖబడ్దార్ అంటూ ఎమ్మెల్యే రౌడీయిజం వ్యాఖ్యలు
- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిపై అనుచిత భాషతో దూషణలు
- భగ్గుమన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లకుండా అడ్డగింత
- మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి హౌస్ అరెస్ట్
- అందరి ఇళ్ల వద్ద భారీగా పోలీసుల మోహరింపు
- టోల్‌ప్లాజా వద్దే మాజీ మంత్రి కారుమూరిని అడ్డగింపు

కూటమి అరాచకాలకు వంత

జిల్లాలో పోలీసులు కూటమి పాలకులకు సాష్టాంగం చేస్తూ సాగిలపడుతున్నారు. చట్టాన్ని పచ్చ నేతలకు చుట్టాలుగా తయారు చేస్తున్నారు. రాజ్యాంగం అంటే గౌరవం లేదు. న్యాయవ్యవస్థ అంటే భయమూ లేదు. కూటమి నేతల అరాచకాలకు వంత పాడుతూ జీ హుజూర్ అంటున్నారు. ప్రతిపక్ష నేతలను బయటకు అడుగు పెట్టనీయకుండా అడ్డుకుంటూ, నోరు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ నెల్లూరులో ఎమర్జెన్సీ పరిస్థితులు సృష్టిస్తున్నారు. కావలి ఎమ్మెల్యే వీధి రౌడీలా కారు కూతలు కూస్తే స్పందించని పోలీసులు, ప్రతిపక్ష నేతలను మాత్రం హౌస్ అరెస్ట్ చేసి అధికార పార్టీ నేతలకు అండగా అడ్డదారులు తొక్కుతున్నారు.

సాక్షి ప్రతినిధి,నెల్లూరు: కూటమి ప్రభుత్వం అరాచకాలకు అంతుపంతు లేకుండా పోయింది. ఇందుకు పోలీస్ యంత్రాంగం తోడైంది. కూటమి ఎమ్మెల్యేల ఆదేశాలే శిరోధార్యంగా భావించి వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి అక్రమ కేసులు పెడుతూ పోలీసులు పైశాచిక ఆనందం పొందుతున్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలం అన్నవరంలో సాగిస్తున్న అక్రమ మైనింగ్ వ్యవహారం, ముసునూరులో జరిగిన మనీ స్కీమ్ స్కామ్‌ను బయట పెడతానని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హెచ్చరికలను జీర్ణించుకోలేకపోయారు. ఇదే సమయంలో సోషల్ మీడియా యాక్టివిస్టులు కావ్య అక్రమ మైనింగ్ గుట్టు రట్టు చేసేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డం పెట్టుకుని ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై హత్యాయత్నం కేసుతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేయించడం తెలిసిందే. వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా పోలీసులు సైతం అధికార ఎమ్మెల్యేకు సాష్టాంగం పడుతూ చట్టాలను తుంగలో తొక్కి తప్పుడు కేసులు బనాయించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే అవినీతిని బహిర్గతం చేస్తామని హెచ్చరించడంతో కలవర పడిన కావ్య ప్రెస్‌మీట్ పెట్టి వీధిరౌడీలా మాట్లాడారు. ఎమ్మెల్యేనని స్థాయి మరిచిపోయి, పక్కనే మహిళ ఉందనే విచక్షణ కోల్పోయి అసభ్యకరంగా, అనుచితంగా మాట్లాడుతూ ఊగిపోయారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి కావలి వస్తే.. ఖబడ్దార్ అంటూ రెచ్చిపోయారు. ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డిని అయితే పత్రికల్లో రాయలేని భాషతో అనుచితంగా మాట్లాడారు. ఎమ్మెల్యే వ్యవహారిక భాషపై, అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండి పడ్డారు.

పోలీసుల రెడ్‌బుక్ రాజ్యాంగం

పోలీసులు చట్టాన్ని గౌరవించడం మానేశారు. న్యాయవ్యవస్థను తప్పుదోవ పట్టిస్తూ రాజ్యాంగాన్ని వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. ఒక ప్రజాప్రతినిధిని, మాజీ మంత్రిని దారుణంగా దుర్భాలాషడిన ఎమ్మెల్యేను వదిలేసిన పోలీసులు ప్రతిపక్షాన్ని కట్టడి చేసే ప్రయత్నం చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి కావలిలోని రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు సిద్ధమైన నేపథ్యంలో పోలీసులు కాకాణి, పర్వతరెడ్డి ఇళ్ల వద్దకు నెల్లూరు వేదాయపాళెం సీఐ శ్రీనివాసరావు, బాలాజీనగర్ సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో భారీగా చేరుకున్న పోలీసులు వారిని బయటకు కదలనీయకుండా అడ్డుకున్నారు. తమ పార్టీ నేతలను పరామర్శ చేయడమే నేరంగా భావించిన పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కాకాణితోపాటు ఉన్న మాజీ ఎమ్మెల్యే కిలివేటిని ఆయన నివాసంలో, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. నోటీసులిచ్చి హౌస్ అరెస్ట్ చేశారు.

కారుమూరిని వెంబడించి..

కావలిలోని ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు విజయవాడ నుంచి వస్తున్న మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావును పోలీసులు వెంబడించారు. ఆయన్ను కావలికి చేరుకోనివ్వకుండా జాతీయ రహదారి పైనే నిలిపి వేశారు. తాను పరామర్శ కోసమే వెళ్తున్నానని చెప్పినా వినిపించుకోకుండా తిరిగి విజయవాడకు పంపించారు. ఆయన వాహనాన్ని జిల్లా సరిహద్దులు దాటించే వరకు పోలీసులు వాహనాలు వెంబడించి పంపించారు.

పోలీసుల అత్యుత్సాహం

- ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్దకు ఎవరినీ వెళ్లకుండా అడ్డగింత
- కావలికి వచ్చే అన్నిదారుల్లో పోలీసుల మోహరింపు, వాహనాల తనిఖీ




బృందావనం కాలనీ వద్ద వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

కావలి (జలదంకి): కావలిలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ వెళ్లకుండా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. నెల్లూరు నుంచి మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు కావలికి వస్తున్నట్లు సమాచారం ఉండడంతో పోలీసులు అత్యుత్సాహం చూపి మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్దకు ఎవరినీ వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఆయన ఇంటికి వచ్చే అన్ని దారుల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. కావలిలోని బృందావనం వద్ద, ముసునూరు టోల్‌ప్లాజా, బైపాస్ క్రాస్‌రోడ్డు, ముసునూరు లింక్ రోడ్డుతోపాటు ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసం వద్ద ఎస్సైలు సుమన్, బాజీబాబు, తిరుమలరెడ్డితోపాటు పోలీసులు వెళ్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీలు చేసి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మా నాయకుడి ఇంటికి కూడా వెళ్లకూడదా అంటూ పోలీసులను ప్రశ్నించారు. కావలిలో ప్రజాస్వామ్యం ఉందా లేక కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేతుల్లో ఉందా అంటూ పోలీసులను నిలదీయడంతో పైఅధికారుల ఆదేశాలంటూ సమాధానమిచ్చారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న పోలీసులు

- మా మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లడానికి ఎందుకీ ఆంక్షలు
- పార్టీ నేతలుగా ప్రతి కార్యకర్తకు ధైర్యం ఇవ్వడం మా బాధ్యత
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చట్టాన్ని గౌరవించాల్సిన పోలీసులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. వాస్తవాలతో సంబంధం లేకుండా అధికార పార్టీ ఎమ్మెల్యే ఏం చెబితే.. అది చేస్తున్నారంటూ విమర్శించారు. కావలిలోని తమ నేత, మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లడానికి ఎందుకీ ఆంక్షలు పెడుతున్నారంటూ మండిపడ్డారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు శుక్రవారం వెళ్తున్న కాకాణితోపాటు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను నగరంలోని కాకాణి నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కాకాణి మీడియాతో మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అవినీతికి పాల్పడుతుంటే విమర్శిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అన్నవరంలో విచ్చలవిడిగా సహజ వనరులను కొల్లగొడుతుంటే ఆ ఫొటోలు తీసేందుకు వెళ్లిన సోషల్ మీడియా యాక్టివిస్టులను నిర్బంధించి వారిని భయపెట్టి బెదిరించి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని ఈ కేసులో ఇరికించారన్నారు. హైకోర్టును ఆశ్రయించిన రామిరెడ్డికి బెయిల్ రాకూడదనే ఉద్దేశంతో నాపై ఏ విధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారో ఆ విధానాన్నే రామిరెడ్డిపై అవలంబిస్తూ తప్పుడు కేసులు, తప్పుడు సెక్షన్లు పెట్టారన్నారు. కావలిలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాట్లాడి ధైర్యమిచ్చామన్నారు. అయితే తనను, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని అభ్యంతరకరంగా మాటలు మాట్లాడారని తెలిపారు. పోలీసులు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని, అవినీతి ప్రజావ్యతిరేక విధానాలను




మాట్లాడుతున్న కాకాణి, చిత్రంలో కిలివేటి

ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, నిర్బంధించడం ఎన్నడూ చూడలేదని, ఇప్పుడు పరిస్థితులు చూడాల్సి వస్తుందన్నారు. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుందని, రాజ్యాంగ విలువలు దిగజారి పోతున్నాయన్నారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి వంటి సౌమ్యుడిపై హత్యాయత్నం కేసు పెట్టడంతో ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఎన్నికలు ఏ రోజు జరిగినా జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జైళ్లకు, అక్రమ కేసులకు భయపడరని తెలిపారు. ఎంత మంది పోలీసులు వచ్చినా, మిలటరీ బలగాలను దింపినా కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తమ పోరాటం ఆగదన్నారు.

నిరంకుశ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నిరంకుశ పాలనతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తన కార్యాలయం నుంచి కావలికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా బాలాజీనగర్ పోలీసులు అడ్డుకుంటూ నోటీసులు ఇవ్వడాన్ని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేక రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఉన్నామంటూ మండిపడ్డారు. తమ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లడాన్ని అడ్డుకోవడం ఏమిటని నిలదీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ రాక్షస ఆనందాన్ని పొందుతుందన్నారు. కూటమి నేతల అరాచకాలకు పోలీసులు వంత పాడడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికుందా అనే సందేహం ప్రతి ఒక్కరిలో కలుగుతుందన్నారు. కావలిలో అధికార పార్టీ చేస్తున్న అక్రమాలను బయటపెడతానని మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

ప్రతాప్‌కుమార్‌రెడ్డి హెచ్చరించడంతో ఆయనపై ఏకంగా హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబానికి సంఘీభావం తెలిపేందుకు కావలి వెళ్లే ప్రయత్నం చేస్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. జిల్లాలో ఎప్పుడూ చూడని వికృతాలు చూడాల్సిన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కావలికి వెళ్తే నరుకుతామని చెబుతున్న వారిని పోలీసులు వదిలేసి తమను నిర్బంధించడం చూస్తుంటే కూటమి ప్రభుత్వ దుర్మార్గాలు ప్రజలకు ఇట్టే అర్థమవుతున్నాయన్నారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కావలికి వెళ్లి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తామని తెలిపారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీ బెదిరేది లేదన్నారు.


అడవిలో సొరంగ మార్గానికి శ్రీకారం



సీతారామపురం అటవీ ప్రాంతంలో జరుగుతున్న సొరంగ తవ్వకాల పనులు

- రూ.857.75 కోట్ల వ్యయంతో టన్నెల్ పనులు
- గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలో భాగంగా నిర్మాణం

సీతారామపురం: విజయవాడ–బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలో భాగంగా జిల్లా సరిహద్దు ప్రాంతమైన మండలంలోని సీతారామపురం–పోరుమామిళ్ల ఘాట్‌రోడ్డు సమీపంలో మ్యాక్స్ ఇన్‌ఫ్రా కంపెనీ రూ.857.75 కోట్ల వ్యయంతో సొరంగ మార్గం (టన్నెల్) తవ్వకాల పనులకు శ్రీకారం చుట్టింది. ఆరు లేన్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వాహనాలు వెళ్లేందుకు, వచ్చేందుకు వేరువేరుగా సొరంగ మార్గాలు నిర్మించనున్నారు. ఒక్కో సొరంగం 16.7 మీటర్ల వెడల్పు, 9.8 మీటర్ల ఎత్తుతో 3.68 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. సీతారామపురం అటవీ ప్రాంతంలో ప్రారంభమయ్యే ఈ సొరంగ మార్గం వైఎస్సార్ కడప జిల్లాలో తెరుచుకుంటుంది. ప్రస్తుతం ఒక సొరంగం మార్గానికి రెండు వైపులా తవ్వకం పనులు ప్రారంభమైనట్లు నిర్మాణ పనులు చేపట్టిన మ్యాక్స్ ఇన్‌ఫ్రా కంపెనీ బృందం తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించిన పనులను 2027 ఫిబ్రవరిలోపు పూర్తి చేయడమే గాక 15 ఏళ్ల పాటు అదే కంపెనీ నిర్వహణ బాధ్యతలను చూడనుంది. సుమారు 520 కిలో మీటర్ల పొడవున నిర్మిస్తున్న విజయవాడ బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలో భాగంగా ఈ టన్నెల్ తవ్వుతున్నారు. ఈ సొరంగం అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హైవేల్లో ఉన్న టన్నెల్స్‌లో ఇదే పొడవైనదిగా రికార్డులకెక్కుతుందని జాతీయ రహదారి సంస్థ అధికారులు అంటున్నారు.



సొరంగాన్ని తవ్వుతున్న యంత్రం


విచారణలో కీలక విషయాలు వెల్లడి

కోవూరు: జీవిత ఖైదీ శ్రీకాంత్ స్నేహితురాలు నిడిగుంట అరుణను పోలీసులు శుక్రవారం రెండో విచారించిన నేపథ్యంలో కీలక విషయాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. అరుణను అడిషనల్ ఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐలు సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరమ్మ విచారించారు. తన దందాల్లో ఎవరెవరి పాత్ర ఉందో వారి పేర్లు చెప్పినట్లు సమాచారం. చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా, గుత్తాధిపత్యంపై పోలీసులు అనేక అంశాలపై బహిర్గతం చేయించే ప్రయత్నం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ విచారణలో పోలీసులు సాక్ష్యాలు, కాల్ డేటా రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, గ్యాంగ్ సభ్యుల కదలికలను ఆమె ముందుంచి ప్రశ్నలు సంధించారు. అరుణ సమాధానాల్లో ఆమె ఆధ్వర్యంలో మాఫియా తరహాలో వ్యాపారం సాగిందన్న విషయాన్ని బలపరిచే ఆధారాలు దొరికినట్లు సమాచారం. మొత్తం 20 ప్రశ్నల ద్వారా విషయాలను రాబట్టినట్లు తెలిసింది. మరో ఇద్దరు కీలక వ్యక్తుల పేర్లు చెప్పడంతో వారిని కూడా రాబోయే రోజుల్లో విచారణకు పిలవాలని పోలీసులు యోచిస్తున్నారు.

అరుణ వెనుక టీడీపీ గోతులు

- ఆమె వ్యవహారం ఆ పార్టీ మెడకు చుట్టుకున్న వైనం
- తమకు సంబంధం లేదంటూ హడావుడి అరెస్ట్‌లు, పోలీస్ కస్టడీ విచారణలు
- టీడీపీ నేత వాహనంలోనే ఆమె తరలింపు

కోవూరు: రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న జీవిత ఖైదీ శ్రీకాంత్, అతని స్నేహితురాలు నిడిగుంట అరుణ వ్యవహారం కూటమి ప్రభుత్వం మెడకు చుట్టుకోవడంతో బయట పడేందుకు నానా పాట్లు పడుతోంది. వీరిద్దరి వెనుక టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్న విషయం పెరోల్‌తో వెలుగు చూసిన విషయం విదితమే. అరుణ ఇటీవల సోషల్ మీడియాలో శ్రీకాంత్‌ను వాడుకున్న టీడీపీ నేతలు ఇప్పుడు మౌనంగా ఉండడంపై ప్రశ్నిస్తూనే అందరి బాగోతాలు బయట పెడుతానంటూ పెట్టిన పోస్టు అధికార పార్టీలో ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ పోస్టు పెట్టిన మరుసటి రోజే అరుణను, ఆమె అనుచరులను ఎప్పటి కేసునో బయటకు తీసి హడావుడిగా అరెస్ట్ చేయడం, పోలీస్ కస్టడీ పేరుతో విచారణ చేపట్టడం తెలిసిందే. అరుణ కేసుతో తమకు సంబంధం లేదంటూనే.. మరో వైపు అరుణను విచారణ నిమిత్తం జిల్లా జైలు నుంచి కోవూరు పోలీస్‌స్టేషన్‌కు, అనంతరం జిల్లా జైలుకు తరలిస్తున్న కారు (ఏపీ 40 డీటీ 3388) టీడీపీ స్థానిక నేత ఇంతా మల్లారెడ్డికి సంబంధించింది కావడం గుసగుసలకు తావిస్తోంది. దీన్ని బట్టి చూస్తే ఆమె వెనుక టీడీపీ నేతలు ఉన్నారా? లేక ఆమె వెనుక గోతులు తవ్వుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ నేత కారు వినియోగంపై పోలీసులు ఎలాంటి వివరణ ఇవ్వకుండా మౌనం దాల్చుతున్నారు. టీడీపీ నేతలతో కలిసి పక్కా అవగాహనతోనే జరుగుతోందనే చర్చ జోరుగా సాగుతోంది. ప్రభుత్వం ఈ వ్యవహారం నుంచి బయట పడటానికి మాత్రమే ప్రయత్నిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేసు విచారణలో పారదర్శకత చూపకుండా, కథలు చెప్పడంపై ప్రజల్లో అనుమానాలకు మరింత బలం చేకూరుతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.



అరుణను విచారణకు తీసుకొచ్చే క్రమంలో వాడిన ఇంతా మల్లారెడ్డి కారు

ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బంది సస్పెన్షన్

నెల్లూరు (క్రైమ్): జీవిత ఖైదీ శ్రీకాంత్ వ్యవహారంలో మరో ముగ్గురు ఏఆర్ కానిస్టేబుల్స్ సస్పెన్షన్‌కు గురయ్యారు. వరుస సస్పెన్షన్‌లు ఆ విభాగంలో కలకలం రేకెత్తిస్తోన్నాయి. ఎస్కార్ట్ సిబ్బంది గతేడాది డిసెంబర్ 17న శ్రీకాంత్‌ను కేంద్ర కారాగారం నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. శ్రీకాంత్ చేతికి గాయమైంది. అయితే పోలీస్ వాహనంలో కాకుండా ప్రైవేట్ వాహనంలో తరలిస్తుండగా అతనికి గాయమైనట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఆ రోజు ఎస్కార్ట్ విధులు నిర్వహించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుల్స్ గంగరాజు, కిశోర్ విధుల్లో నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఎస్పీ జి. కృష్ణకాంత్ విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

ట్రేడింగ్‌లో లాభాలొస్తాయని నమ్మించి..

- రూ.45.20 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

నెల్లూరు(క్రైమ్): ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఓ వ్యక్తిని నమ్మించి రూ.45.20 లక్షలను సైబర్ నేరగాళ్లు దోచేశారు. పోలీసుల కథనం మేరకు.. ఏకేనగర్ పోలీసు కాలనీలో ఓ వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అతను విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తూ తద్వారా వచ్చిన నగదుతో జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది జూలై 5వ తేదీన శానికగోఖ్లే అనే వ్యక్తి వాట్సాప్‌లో అతడికి మెసేజ్ చేశాడు. తాను ఓ ప్రొఫెసర్ అసిస్టెంట్‌నని పరిచయం చేసుకుని ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే మూడింతలు లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో అతని మాటలు నమ్మి ఎనిమిది దఫాలుగా బాధితుడు రూ.45 లక్షలు పెట్టాడు. అప్పటి నుంచి సైబర్ నేరగాడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

గంజాయి కేసులో రౌడీషీటర్ల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): గంజాయి కేసులో ఆరుగురు రౌడీషీటర్లను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం.రోశయ్య శుక్రవారం వివరాలను వెల్లడించారు. ప్రగతినగర్‌కు చెందిన షేక్ ముక్తియార్, జేవీఆర్ కాలనీకి చెందిన సంతోష్, బుజబుజ నెల్లూరుకు చెందిన వెంకటతేజ, లేక్‌వ్యూ కాలనీకి చెందిన వినయ్, వెంగళరావ్‌నగర్‌కు చెందిన బాలమణికంఠ, బుజబుజనెల్లూరుకు చెందిన ఛత్రపతి రౌడీషీటర్లు. వ్యసనాలకు బానిసైన వీరు గంజాయి విక్రేతలుగా మారారు. గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయించేందుకు తరలిస్తున్నారని దర్గామిట్ట పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో బారాషహీద్ దర్గా సమీపంలో నిందితులను అరెస్ట్ చేసి తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని జైలుకు పంపామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అధికారుల చుట్టూ తిరుగుతూ..

- డీఎస్సీలో అంతా గందరగోళమే..
- 673 మందికి గానూ 641 మందికే కాల్‌లెటర్లు
- ఎప్పుడు వస్తాయన్న దానిపై సమాధానం కరువు
- రాష్ట్ర స్థాయిలోనే రోస్టర్ కమ్ రిజర్వేషన్


సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చిన అభ్యర్థులు

నెల్లూరు(టౌన్): డీఎస్సీ ఆరంభం నుంచి గందరగోళం నెలకొంది. కాల్‌లెటర్లు రాని అభ్యర్థులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో అభ్యర్థుల మార్కులను జిల్లా విద్యాశాఖ కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచేవారు. అభ్యంతరాలు స్వీకరించి తుదిజాబితాను రూపొందించేవారు. ఆ తర్వాత జాబితా ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగేది. అయితే ఈసారి అంతా విరుద్ధంగా ఉంది. తొలినుంచి వ్యవహారమంతా రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచే జరుగుతోంది. ఎంపికైన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని ఆదేశించారు. దీంతో ఎవరికెన్ని మార్కులు వచ్చాయి?, రిజర్వేషన్ కేటగిరీలో ఏ పోస్టులు పోయాయో తెలియని పరిస్థితి. పారదర్శకంగా చేయాల్సిన ప్రక్రియ గోప్యంగా చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మెరిట్ జాబితాలో పేరుండి కాల్‌లెటర్లు రాని అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయలేని స్థితిలో జిల్లా విద్యాశాఖాధికారులున్నారు. శుక్రవారం ఏడుగురు అభ్యర్థులకు మెసేజ్ రాలేదు. వివరాలను రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి జిల్లాకు పంపించడంతో వారి సూచనలతో కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్నారు.

ఎప్పుడొస్తాయో..

జిల్లాలో మొత్తం 673 పోస్టులున్నాయి. ఈ పోస్టులకు సంబంధించి రోస్టర్ కమ్ రిజర్వేషన్ ఆధారంగా 673 మందికి కాల్‌లెటర్లు పంపించాల్సి ఉంది. అయితే గురువారం నాటికి 585 మంది, అదేరోజు రాత్రి 56 మందికి పంపించారు. గురువారం 585 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టగా ఏడుగురు అభ్యర్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం 56 మందికి వెరిఫికేషన్ నిర్వహించాల్సి ఉండగా ఒకరు రాలేదు. మొత్తంగా రెండు రోజులకు కలిపి 641 మందికి కాల్‌లెటర్లు రాగా 633 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. 8 మంది గైర్హాజరయ్యారు. ఇంకా 32 మందికి కాల్‌లెటర్లు రాలేదు. ఎప్పుడొస్తాయో అనే దానిపై జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం లేదు. అయితే మెరిట్ లిస్టులో పేర్లు ఉండి దూరప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోనే పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఉంది. రోస్టర్ కమ్ రిజర్వేషన్‌పై కూడా అంతగా అవగాహన లేకపోవడంతో లెటర్లు అందని అభ్యర్థుల సందేహాలకు సమాధానం చెప్పే వారు కరవయ్యారు. ఇప్పుడు లెటర్ రాకపోతే ఎప్పుడు వస్తుందోనన్న ఆందోళన నెలకొంది.

కాల్‌లెటర్ రాలేదు



నాకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ కేటగిరీలో 89వ ర్యాంక్ వచ్చింది. మెరిట్ లిస్టులో 8వ పేరు ఉంది. ఈ కేటగిరీకి సంబంధించి పురుషులు – 4, మహిళలు – 2 కలిపి 6 పోస్టులున్నాయి. అయితే నా కంటే ముందున్న ఇద్దరు అభ్యర్థులు పీజీటీ, టీజీటీ పోస్టులకు వెళ్లారు. ఆరుగురు అభ్యర్థులకు పోస్టులు రావాలి. అయితే నాకు ముందున్న ఐదుగురు అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపించారు. నాకు పంపించలేదు. రెండు రోజులుగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నా.

– సీహెచ్ సుధీర్, కోవూరు

రెండురోజుల నుంచి ఇక్కడే ఉన్నా



నాకు స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్ కేటగిరీలో 36వ ర్యాంక్ వచ్చింది. ఈ కేటగిరీలో 4 పోస్టులున్నాయి. ముగ్గురికి కాల్‌లెటర్లు పంపించారు. ఇంకా ఈ కేటగిరీలో ఒక పోస్టు ఖాళీగా ఉంది. మాది బీసీ డీ. ఇంకా కాల్‌లెటర్ అందలేదు. దాని కోసం రెండు రోజులుగా నెల్లూరులోనే ఉంటున్నా. జిల్లా అధికారులను అడిగితే మా చేతుల్లో ఏమీ లేదని, లెటర్ వచ్చిన వారి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తామన్నారు.

– జి.చంద్రశేఖర్, సూళ్లూరుపేట

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

- మంత్రి నారాయణ


మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యేలు, నుడా, కార్పొరేషన్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. కొత్త లేఅవుట్లలో పది శాతం స్థలం పార్క్, దేవాలయాలకు వదిలేయాలని చెప్పారు. అనంతరం సర్వేపల్లి, కావలి, కందుకూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరు నాగేశ్వరరావు, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. సమీక్షలో కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఆర్డీఓ అనూష, కమిషనర్ నందన్, కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో అపశ్రుతి

- బాణసంచా ప్రమాదంలో పదిమందికి గాయాలు

ఉదయగిరి: వినాయక నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అప్పసముద్రం, నడింపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను మూడోరోజైన శుక్రవారం నిమజ్జనం కోసం తరలించారు. అప్పసముద్రంలో రెండు విగ్రహా ఊరేగింపులు ఒక ప్రదేశానికి చేరుకున్నాయి. నడింపల్లి ఊరేగింపులో మద్యం తాగిన వ్యక్తి బాణసంచా కాల్చే క్రమంలో నిప్పురవ్వలు అప్పసముద్రం ఊరేగింపు వాహనంలో పడ్డాయి. అందులో ఉన్న బాణసంచా పేలింది. దీంతో పదిమంది బాలబాలికలకు గాయాలయ్యాయి. వారిని వెంటనే దుత్తలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అనంతరం వింజమూరులోని వైద్యశాలకు తరలించారు. ఐదుగురు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో నలుగురు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల తరలించారు. ఓ చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో బాధిత తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అన్నదాతలపై కనికరం లేదా?

- కలెక్టరేట్ ఎదుట కౌలు రైతు సంఘం నిరసన

నెల్లూరు రూరల్: అన్నదాతలపై కనికరం లేదా అని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఐఏబీ సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో 3.50 లక్షల ఎకరాల సాగు నీరిస్తామని చెప్పడంతో రైతులు వరి పంట వేశారన్నారు. ధాన్యం మార్కెట్లోకి రాబోతుండగా కొనుగోలు కేంద్రాల ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. మిల్లర్ల కోసమే ఈ ప్రభుత్వం, అధికారులు పనిచేస్తోందని ఆరోపించారు. ఇదే కొనసాగితే రైతుల ఆత్మహత్యలు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నెల్లూరు జిల్లా కమిటీ అధ్యక్షుడు ముత్యాల గురునాథం, కార్యదర్శి తుళ్లూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

మాకు ఆ డ్యాన్స్‌లు కావాలి

కోవూరు: నియోజకవర్గంలో తెలుగుదేశంలో ఆధిపత్య పోరు మరోసారి బహిర్గతమైంది. కొడవలూరు మండలం గుండాలమ్మపాళెంలో వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడ పోలంరెడ్డి వర్గం అశ్లీల నృత్యాలు వేయించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఇది వద్దని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వర్గం చెబుతోంది. దీంతో వారి మధ్య విభేదాలు నెలకొన్నాయి. వినాయకుని పూజా, సాంస్కృతిక కార్యక్రమాలు పండగ వాతావరణంలో జరగాలి కానీ అసభ్యకర ప్రదర్శనలు వద్దని గ్రామపెద్దలు చెబుతున్నారు. అయితే ఈ వ్యవహారంపై సమాచారం ఉన్నా పోలీసులు తమకేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ప్రతి సంవత్సరం గ్రామంలో వినాయకచవితి ఉత్సవాలు ఐక్యతకు ప్రతీకగా నిలిచేవి. ఈసారి మాత్రం టీడీపీలోని వర్గాల కారణంగా పరిస్థితి మారింది.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై క్రిమినల్ చర్యలకు సిఫార్సు

దుత్తలూరు: మండలంలోని నరవాడ పంచాయతీలో ఉపాధి నిధులను కాజేశారని ఆరోపణలపై ఫీల్డ్ అసిస్టెంట్ డి.హరికృష్ణపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ జిల్లా అంబుడ్స్‌మన్ ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. పంచాయతీ పరిధిలో ఉపాధి పనుల్లో రూ.2,50,624 నిధులు దుర్వినియోగం చేసినట్లు, అలాగే కుటుంబ సభ్యులు సహా 38 మంది వేతనదారుల నకిలీ సంతకాలు, బొటనవేలితో మస్టర్లు వేసినట్లు విచారణలో తేల్చారు. స్థానికంగా నివాసం లేని వారు, మరణించిన వారు, విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు తదితరుల పేరిట బినామీ మస్టర్లు వేసి నగదు కాజేసినట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. అంతేకాక ఉద్యోగులకు జాబ్‌కార్డులు మంజూరు చేయడం, మైక్రో ఏఎల్‌ఎంల ద్వారా బ్యాంకింగ్ ప్రత్యామ్నాయ మార్గాల్లో ఏటీఎం కార్డులను తన వద్ద పెట్టుకుని దుర్వినియోగం చేసినట్లు వివరించారు. అతడిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి నోటీసులు జారీ చేశారు. మూడు పర్యాయాలు జరిపిన విచారణకు సహకరించకపోవడంతోపాటు అతడిపై ఆరోపించిన విషయాలు వాస్తవాలని నిర్ధారించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మండల అధికారులు ధ్రువీకరించారు.

గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టి..


తీవ్రంగా గాయపడిన రత్నవేలు


కారులో ఇరుక్కుపోయిన గాంధీ

- తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు
- పరిస్థితి విషమం

ఉలవపాడు: గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారిపై చాగల్లు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. చెన్నైకు చెందిన రత్నవేలు, గాంధీ తండ్రీకుమారులు. కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వీరు స్వస్తిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో పనిచేస్తున్నారు. ఆఫీస్ పని నిమిత్తం చెన్నైకు సొంత కారులో బయలుదేరారు. ఉలవపాడు దాటి చాగల్లు సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని కారు బలంగా ఢీకొట్టి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. ఇద్దరికీ తీవ్రగాయాలై స్పృహ కోల్పోయారు. డ్రైవింగ్ చేస్తున్న గాంధీ లోపల ఇరుక్కుపోయాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది శ్రమించి బయటకు తీశారు. క్షతగాత్రులను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుభాష పరిరక్షణ అందరి బాధ్యత

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- సింహపురిలో తెలుగు భాషోత్సవాలు ప్రారంభం


వెంకయ్యనాయుడికి సన్మానం

నెల్లూరు(బృందావనం): తెలుగుభాష పరిరక్షణ అందరి బాధ్యత కావాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా సేవ తెలుగుభాష, సాహితి, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులు జరిగే తెలుగుభాషోత్సవాలను శుక్రవారం నెల్లూరు పురమందిరంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు రంగాల్లో బహుముఖ ప్రజ్ఞ చూపిన గిడుగువారు తెలుగువారందరికీ ఆదర్శనీయులన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని మాతృభాష పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. తిక్కన మహాకవి మొదలుకుని తన గురువు పోలూరు హనుమజ్జానకీరామ శర్మ వరకు ఎందరో మహనీయులు తెలుగు సాహిత్య సేద్యం చేశారన్నారు. తెలుగు మన చిరునామా అన్నారు. మన జీవితాలకు వెలుగునిచ్చేది మాతృభాషేనన్నారు.

- ప్రసార భారతి విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరు అనంత పద్మనాభరావు అధ్యక్షతన జరిగిన తొలిరోజు సభలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి) పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (అనంతపురం) విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ అల్లం శ్రీనివాసరావు, గిడుగు రామమూర్తి పంతులు వారసులు, పెద్దకోడలు గిడుగు సరస్వతి తదితరులు పాల్గొని ప్రసంగించారు. వ్యాఖ్యాతలుగా డాక్టర్ పత్తిపాక మోహన్, డాక్టర్ శోభ కొణిదెల వ్యవహరించారు. ఆత్మీయ అతిథులుగా ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. తొలుత సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు స్వాగతోపన్యాసం చేశారు.
- మధ్యాహ్నం నిర్వహించిన ప్రాచీన సాహిత్య సదస్సుకు సభాధ్యక్షుడిగా తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ వ్యవహరించారు. ప్రముఖ సాహితీవేత్తలు అప్పాజోస్యుల సత్యనారాయణ, ఆచార్య పాపినేని శివశంకర్, ఆచార్య టి.గౌరీశంకర్, అల్లు భాస్కరరెడ్డి ప్రాచీన సాహిత్య విలువలను వివరించారు. కవి, విమర్శకులు డాక్టర్ పెరుగు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఆధునిక సాహిత్య సదస్సులో ఆచార్య శిఖామణి మాట్లాడారు. కందిమళ్ల సాంబశివరావు బాలనాటక రంగం ప్రాధాన్యతను వివరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ అధ్యక్షతన జరిగిన బాలసాహిత్య సదస్సులో విశిష్ట అతిథులుగా డాక్టర్ డీకే చదువులబాబు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, చంద్రలత, డాక్టర్ కందేపి రాణీప్రసాద్, దార్ల బుజ్జిబాబు, టీవీ రామకృష్ణ పాల్గొన్నారు. కవితోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా బోర భారతీదేవి, డాక్టర్ శోభ కొణిదెల, గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, డాక్టర్ కె.కరుణశ్రీ తదితరులు వ్యవహరించారు.

పక్కాగృహాల్లో తనిఖీ


విజిలెన్స్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రమేష్ తదితరులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పక్కాగృహాల నిర్మాణంలో అవినీతి జరిగిందని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్‌రాజు శుక్రవారం నెల్లూరు వచ్చి పరిశీలించారు. వెంకటేశ్వరపురంలోని గృహాలతోపాటు రూరల్ మండల పరిధిలోని కొండ్లపూడి లేఅవుట్‌లో లబ్ధిదారులకు నిర్మించిన ఇళ్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ మోహన్‌రావు, డీఈ షంషుద్దీన్, ఏఈలు పాల్గొన్నారు.

- జిల్లాలో కాంట్రాక్టర్లు, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కుమ్మక్కై నివాసం ఉండేందుకు వీల్లేకుండా తూతూమంత్రంగా నిర్మాణాలు చేపట్టారంటూ బీజేపీ నాయకుడు మిడతల రమేష్ విజిలెన్స్, హౌసింగ్ అధికారులకు బంతిపూలు ఇచ్చి నిరసన తెలిపారు.

8 ఏళ్లుగా అద్దె కట్టని దుకాణం సీజ్

నెల్లూరు(బారకాసు): సుబేదారుపేటలోని మున్సిపల్ ఎస్‌సీ బిల్డింగ్‌లో ఓ దుకాణానికి సంబంధించి యజమాని 8 ఏళ్లుగా అద్దె కట్టని కారణంగా రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఆ కాంప్లెక్స్‌లో షాప్ నంబర్ పదికి సంబంధించి అద్దెకు ఉంటున్న యజమాని 2017 డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూలై వరకు బాడుగ రూ.17,84,754లు ఎన్‌ఎంసీకి కట్టలేదు. కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో సచివాలయ అడ్మిన్ దొరబాబుతోపాటు మున్సిపల్ సిబ్బంది సమక్షంలో దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ కిరణ్ మాట్లాడుతూ తాము అందజేసిన నోటీసుకు మూడు రోజుల్లోపు అద్దె బకాయిలు మొత్తాన్ని చెల్లించాలని, లేనిపక్షంలో చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.


దుకాణాన్ని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ : రూ.117
లేయర్ : రూ.118
బ్రాయిలర్ చికెన్ : రూ.214
స్కిన్‌లెస్ చికెన్ : రూ.236
లేయర్ చికెన్ : రూ.200

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10